క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో ఇద్దరికి స్థానం



రఘుమాధవరెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు

గడివేముల: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా సెక్రటరీగా బూజునూరుకు చెందిన రఘుమాధవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నంద్యాల వెంకటేశ్వర్లును నియమించారు. ఆదివారం వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన పాణ్యం ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో కోరారు. స్థానిక మండల భవిత కేంద్రం ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష చే ఫిజియోథెరపీ చేస్తారన్నారు. దివ్యాంగులకు భవిత కేంద్రానికి తీసుకవచ్చి, ఫిజియోథెరపీని చేయించుకోవాలని సూచించారు.

చనుగొండ్లలో పారిశుద్ధ్య పనులు



చెత్తను ట్రాక్టర్‌లోకి వేస్తున్న జేసీబీ

గూడూరురూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో ఆదివారం గ్రామపంచాయతీ కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. చెత్తను జేసీబీ యంత్రం ద్వారా ట్రాక్టర్‌లో తీసుకెళ్లి ఊరి బయట ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం షెడ్డుకు తరలిస్తున్నారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించిన సర్పంచ్ వెంకటేశ్వరమ్మ ప్రతిఒక్కరూ పరిసరాలు శుభ్రత పాటించాలని సూచించారు.మురుగుకాలువల వెంట, అశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టామని సర్పంచ్ తెలిపారు.

నేడు 'స్పందన'

కర్నూలు (న్యూటౌన్): ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే 'స్పందన' కార్యక్రమం సమస్యలకు పరిష్కార వేదిక అని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ సోమవారం నిర్వహించనున్న స్పందనలో ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై గ్రామీణ ప్రాంత ప్రజలు అర్జీలిస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పందనకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గూడూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్పందనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీరు విడుదల

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు 331 క్యూ సెక్కుల నీరు విడుదల చేసినట్లు ఆదివారం డ్యామ్ అధికారులు తెలిపారు. జలాశయానికి ఇన్ ఫ్లో నిలిచి పోయిందని, ప్రస్తుతం 0.751 టీఎంసీల నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలి

కల్లూరు: ప్రకృతి వ్యవసాయ సిద్ధాంతాలు, దాని వెనుక ఉన్న శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలని రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ టి.వి జయ్‌కుమార్ రైతు శాస్త్రవేత్తలకు, మెంటర్లకు సూచించారు. ఆదివారం కర్నూలు ఉద్యాన భవన్ రైతు శిక్షణ కేంద్రంలో జూమ్ మీటింగ్ ద్వారా రీజినల్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్థాయి థిమాటిక్ లీడ్స్ సుధాకర్, సురేష్, కన్సల్టెంట్ లక్ష్మయ్య హాజరయ్యారు. సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ జూమ్ మీటింగ్ ద్వారా ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు–ఆవశ్యకత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో థిమాటిక్ పాయింట్ పర్సన్స్ నీరజ, చిరంజీవి, డిస్ట్రిక్ పాయింట్ పర్సన్స్ శ్వేతా, సలీం, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వ్యాధుల నివారణ

- వాతావరణ మార్పులు, అపరిశుభ్రతతో రోగాలు వ్యాపించే అవకాశం
- ముమ్మరంగా ఫీవర్ సర్వే
- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలంటున్న వైద్యాధికారులు
- గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన



గడివేములలో ఫీవర్ సర్వేను నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గడివేముల: తాగునీటి పైపులు కలుషితం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, మురుగుకుంటల్లో దోమలు వృద్ధి చెందడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి. ఇప్పటికే జ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ సీజన్‌లో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామెర్లు, చికెన్‌గున్యా వంటి వ్యాధుల ఉధృతి పెరిగే అవకాశాలెక్కువ. ఆయా గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటి వద్దకు వైద్యసిబ్బంది వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు. ప్రజలు ఇళ్లలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.

గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

ప్రతి శుక్రవారం డ్రైడేను గ్రామాల్లోని పంచాయతీ అధికారులు, వైద్యసిబ్బంది నిర్వహించి గ్రామాల పరిశుభ్రతకు పాటుపడుతున్నారు. గ్రామాల్లో అపరిశుభ్రంగా ప్రాంతాల్లో పంచాయతీ అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తూ, మండల స్థాయి అధికారులకు తెలియజేస్తూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. వర్షాకాలం కావడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అవగాహన కల్పించడంతో పాటు రోగాల బాధపడుతున్న వారి రక్తనమూనాలను సేకరిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.

నివారణ చర్యలు

సాలమనెల్లా టైఫీ బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తిచెందే టైఫాయిడ్‌తో పాటు డయేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణంతకమని వైద్యులు చెబుతున్నారు. బ్యాక్టీరియా ద్వారా కాలుష్యానికి గురయ్యే నీటిని సేవించడం వల్ల ఈ వ్యాధులు సంక్రమిస్తాయి. వీటి నివారణ కోసం ప్రభుత్వం ప్రతిష్టమైన చర్యలు చేపడుతుంది. మలేరియా నివారణ కోసం చేపడుతున్న ఫ్రై డే డ్రై డేలు బహుళప్రయోజనాలు ఇస్తున్నాయి. మంచినీటి నిల్వలో పెరిగే బ్యాక్టీరియా నివారణకు క్షేత్రస్థాయిలో సిబ్బంది పనిచేస్తున్నారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉన్నచోట పరిశీలించి క్లోరినేషన్ చేయిస్తున్నారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- ఆహారం, నీరు కలుశితం కాకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీరు, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి.
- మల, మూత్ర విసర్జన అనంతరం చేతులు శుభ్రపరుచుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో టైర్లు, డ్రమ్ములు ఉంచకూడదు.
- దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి.
- పండ్లు, కూర గాయలు శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలి.
- చిన్న పిల్లలకు ఒంటిని పూర్తి కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి. ఇళ్లలో దోమతెరలు, కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జ్వరాలు అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండు రోజుల కంటే జ్వరం తగ్గకుంటే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలి. అవరమైన మందులు, రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు నీళ్లు కాచుకుని తాగాలి. పీహెచ్‌సీల్లో అవసరమైన మందులు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, యాంటి బయాటిక్స్, సెలైన్ బాటిల్స్, పారాసిటమాల్ మందులు అందుబాటులో ఉన్నాయి. జ్వరం వస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అవసరమైన రక్తపరీక్షలు చేయించుకోవాలి. అన్ని గ్రామాల్లోని వైద్య సిబ్బందితో పాటు వలంటీర్లు ఫీవర్ సర్వేను నిర్వహిస్తున్నారు. స్థానిక పీహెచ్‌సీలో రక్తనమూనాలను పరిశీలించి అవసరమైన వారికి ఉచితంగా మందులను వైద్య సిబ్బంది ఇంటి వద్దక వెళ్లి అందిస్తున్నారు.

– డాక్టర్ తేజస్వీని, వైద్యాధికారిణి, పీహెచ్‌సీ, గడివేముల

- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ఇంటి ముందు చెత్తను వేయరాదు.
- ఇంటి పరిసరాల్లో కొబ్బరిబొండాలు,పాత ఇటు వంటి మురుగునీటి ప్రాంతాలే జ్వరానికి కారణం.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత



ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తో చైర్మన్ గౌతంరెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వైఎస్ఆర్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ గౌతంరెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలుకు వచ్చిన ఆయన స్థానిక పాతబస్తీలోని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ కార్యాలయంలో కాసేపు కార్యకర్తలతో మాట్లాడారు. అన్ని వర్గాలతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు తమదేనని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు.

అక్రమంగా నాపరాయి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ) : అక్రమంగా నాపరాయిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. ఎలాంటి అనుమతి లేకుండా నాపరాయిని తరలిస్తున్న రెండు లారీలను తాండ్రపాడు వద్ద, డోల్‌మీట్ పౌడర్ తీసుకెళ్తున్న మరో లారీని ఉలిందకొండలో శనివారం రాత్రి పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. వాటికి రూ.84,850 అపరాధ రుసుం విధించామని చెప్పారు. వాహనాల తనిఖీలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, విజిలెన్స్ అధికారులు, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ అభ్యున్నతికి పాటు పడాలి



పార్టీ శ్రేణులతో జిల్లా అధ్యక్షుడు, మేయర్ రామయ్య

కల్లూరు: అందరూ సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యున్నతికి పాటు పడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య సూచించారు. ఆదివారం మేయర్ క్యాంపు కార్యాలయంలో పార్టీ కమిటీల ఏర్పాటుపై కర్నూలు నియోజకవర్గ నాయకులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు మరో 8 నెలలే మిగిలిందని, ఈ తరుణంలో నూతన కమిటీల పనితీరు చాలా కీలకమన్నారు. రాబోయ్యే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అందరూ క్షేత్రస్థాయిలో సమన్వయంతో ప్రభుత్వ ప్రజారంజక పాలనను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్షాల చేస్తున్న అసత్య ఆరోపణలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ, ప్రతిపక్షాల తీరును ఎండగట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి నామినేటెడ్ పదవులతో పాటు, అనేక పదవులు సృష్టించి అందరికి అవకాశం కల్పించారన్నారు. కష్టపడ్డవారిని గుర్తించి న్యాయం చేసే ఏకై క పార్టీ వైఎస్సార్‌సీపీనే అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ మద్దయ్య, ఆది మోహన్ రెడ్డి, శ్రీరాములు, రైల్వే ప్రసాద్, దేవపూజ ధనుంజయ ఆచారి, రవిగౌడ్, బత్తుల లక్ష్మీకాంతయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీను, బంగారు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వద్దుగండ్ల చెరువు నిండిన దృశ్యం



పాణ్యం ఊరుముందరి చెరువు నిండిన దృశ్యం

చెరువులకు జలకళ

పాణ్యం: మండలంలో ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ కింద ఉన్న చెరువులు దాదాపుగా నిండాయి. ఇటీవల గోరుకల్లు జలాశయంలోకి నీటిని వదలడం, అక్కడక్కడ కాల్వలో లీకైన నీరు చెరువుల్లో వచ్చి చేరుతోంది. దీంతో చెరువులు కళకళాడుతున్నాయి. పాణ్యం మండలంలోని వద్దుగండ్ల, పాణ్యం ఊరుముందరి చెరువు, భూపనపాడు, ఆలమూరు చెరువులకు నీరు చేరాయి. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆలమూరు చెరువుకి భారీగా చేరిన నీరు

కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలి



ఉల్చాలలో రైతులతో కలిసి పత్తిపంటను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): జిల్లాలో కరువు ఛాయలు నెలకొటున్నాయని, వెంటనే కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో రైతులతో కలిసి ఉల్లి, కంది, పత్తి పంట పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉల్చాలలో 10వేల ఎకరాలకు పైగా సాగు భూమి ఉందని, 80 శాతం భూమిలో పత్తి, కంది, మిరప, సాయాబీన్స్‌సాగు చేశారన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రైతులు లక్షలు పెట్టుబడులు పెట్టి నష్టపోయారని చెప్పారు. ఈ క్రాప్ బుకింగ్ కూడా పూర్తి స్థాయిలో చేయలేదని, అధికారులు అనేక కారణాలు చెప్పి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ప్రభుత్వం నుంచి వచ్చే సహాయం కూడా అందకుండా పోయేపరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ క్రాప్ బుకింగ్ చేసి, కరువు జిల్లాగా ప్రకటించి ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, రైతులు వెంకటయ్య, శివన్న, ఇస్మాయిల్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల – తిరుపాడు గ్రామాల మధ్యలో బైకు అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం తిరుపాడు గ్రామానికి చెందిన బొమ్మన పెద్ద మహేశ్వర రెడ్డి సొంతపనుల నిమిత్తం పారుమంచాల గ్రామానికి స్కూటీపై వెళ్లాడు. పనులు ముగించుకుని సొంత గ్రామానికి వస్తుండగా గడిగరేవుల– తిరుపాడు గ్రామాల మధ్య రోడ్డుపై ఉన్న చీలికలలో స్కూటీ టైరు పడటంతో అదుపు తప్పి కిందపడిపోయింది. దీంతో మహేశ్వరరెడ్డికి గాయాలు కావడంతో రోడ్డుపై వెళ్లె వాహనదారులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సారా విక్రేత అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

ఓర్వకల్లు: మండలంలోని గుడుంబాయి తండా వద్ద నాటుసారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. గుడుంబాయితండాకు సమీపంలో గల కొమ్ముచెరువు ఆంజనేయస్వామి గుడి వద్ద ఆదివారం తండాకు చెందిన లక్ష్మానాయక్ అనే వ్యక్తి గుట్టు చప్పుడుగా సారా విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. ఆ మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, మట్కా, సారా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపుతామని హెచ్చరించారు.

29న ధ్యాన్‌చంద్ విగ్రహ ఆవిష్కరణ

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ధ్యాన్ చంద్ విగ్రహాన్ని ఈనెల 29వ తేది జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆవిష్కరించనున్నట్లు హాకీ సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి సుధీర్ తెలిపారు. క్రీడా సంఘాలు విన్నవించగానే కలెక్టర్ స్పందించి విగ్రహం ఏర్పాటుకు కృషి చేయడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

కిక్ బాక్సింగ్‌లో సత్యవైభవికి వెండి పతకం



వెండి పతకంతో బాలిక సత్యవైభవి

కర్నూలు(హాస్పిటల్): జాతీయ స్థాయిలో నిర్వహించిన కిక్‌బాక్సింగ్ పోటీలో కర్నూలుకు చెందిన సత్యవైభవి అనే బాలిక వెండి పతకం సాధించింది. విజయ హాస్పిటల్‌లోని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విజయకృష్ణారెడ్డి కూతురైన ఆమె స్థానిక గుత్తి రోడ్డులోని మాంటె ఇంటర్నేషనల్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతోంది. ఆమె ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచిలో జరిగిన నేషనల్ కిక్ బాక్సింగ్ (చిల్డ్రన్ కేడెట్స్ అండ్ జూనియర్)లో పాల్గొంది. ఆదివారం జరిగిన పాయింట్ ఫైట్‌లో కేరళకు చెందిన బాలికతో తలపడి వెండి పతకం సాధించింది. ఈ బాలిక నరేంద్ర ఆచారి, లక్ష్మిల వద్ద కిక్ బాక్సింగ్‌లో శిక్షణ పొందారు.

విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం

కర్నూలు(సెంట్రల్) : విజయవాడలో సెప్టెంబర్ 15వ తేదీన అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు అన్నారు. ఈ సమావేశానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో శంఖారావానికి సంబంధించిన కరపత్రాలను ఆయన సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

ప్రమాదకరంగా కల్వర్టు!



కె.నాగలాపురం సమీపంలో దెబ్బతిన్న రహదారి

గూడూరు రూరల్: కె.నాగలాపురం నుంచి బూడిదపాడుకు వెళ్లే రహదారిలో కల్వర్టు శిథిలమై ప్రమాదకరంగా మారింది. కె.నాగలాపురం సమీపంలోని గంగమ్మ గుడి వద్ద ఉన్న కల్వర్టు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. గతంలో మరమ్మతులు చేయాలని గ్రామపంచాయతీ, మండల పరిషత్ అధికారులు తీర్మానం చేసినా నేటికీ ప్రయోజనం చేకూరలేదు. శిథిలమైన కల్వర్టుపై వాహనాల రాకపోకలకు పూర్తి ఇబ్బందిగా మారింది. గుంతలు కనిపించక వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలు జరిగిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఝులన్ యాత్ర





ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ దేవతా మూర్తులు,హరేకృష్ణ సంకీర్తన చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఆదివారం శ్రీ రాధా గోవిందుల ఝులన్ యాత్ర ఉత్సవాలు, శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఊయల సేవ, ప్రవచనం, మహారాజ భోగ నివేదన చేశారు. ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలన్నారు. పురాణ ఇతిహాసాలను పఠనం చేయాలన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాంఘిక నాటకాలతోనే సమాజ చైతన్యం



మహమ్మద్ రఫీకి జి.ఎల్.ఎన్.మూర్తి స్మారక పురస్కారాన్ని అందజేస్తున్న అతిథులు



తులసి తీర్థ నాటకంలో అలరించిన సన్నివేశం

కర్నూలు కల్చరల్: సమాజ చైతన్యానికి సాంఘిక నాటకాలు ఎంతో దోహద పడతాయని విశ్రాంత ఐఏఎస్, సీనియర్ కళాకారులు గుమ్మళ్ల బలరామయ్య అన్నారు. కళావిపంచి, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సాంఘిక నాటకోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. బలరామయ్య, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు రామరాజు శ్రీనివాసరావు, కథక్ కళాకారుడు అంజిబాబు, నాటక ప్రయోక్త డి. రామకోటేశ్వరరావు, ఆదిలీలా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.ఆదినారాయణ, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బలరామయ్య మాట్లాడుతూ కర్నూలులో క్రమంగా సాంఘిక నాటకాలకు ఆదరణ పెరుగుతుందన్నారు. కళలను, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జీఎల్ఎన్ మూర్తి స్మారక పురస్కారాన్ని హైదరాబాద్ కళ పత్రిక ఎడిటర్ మహమ్మద్ రఫీకి అతిథులు ప్రదానం చేశారు. అనంతరం ప్రదర్శించిన మల్లాది క్రియేషన్స్ వారి 'తులసి తీర్థ', హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్ వారి 'థింక్' నాటికలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, ముఖ్య సలహాదారుడు డి. రామకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.జి. శంకర్, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు యాంగటేశ్వరప్ప, సంగా ఆంజనేయులు, క్రిష్టఫర్, బాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబసభ్యుల చెంతకు యశోదమ్మ

కర్నూలు(అగ్రికల్చర్): తప్పిపోయి ప్రమాదానికి గురైన కర్ణాటకకు చెందిన ఒక వృద్ధురాలిని కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 13న ఆటో నగర్ సమీపంలోని ప్లైవైర్ బ్రిడ్జి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డుపై గాయాలకు గురై అపస్మారక స్థితిలో వృద్ధురాలు ఉండగా పోలీసులు గుర్తించారు. వెంటనే వారు 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. మతిస్థిమితం లేకపోవడంతో ఆమె కర్నూలు వచ్చారు. ఆసుపత్రిలో చికిత్స వల్ల కొంత వరకు ఆరోగ్యం కుదుటపడటంతో వృద్ధురాలు తన వివరాలు వెల్లడించింది. పేరు యశోదమ్మ అని బెంగుళూరులోని అరికెర ప్రాంతం తనదని పోలీసులకు చెప్పారు. పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం సాయంత్రం వారు 4వ పట్టణ పోలీసు స్టేషన్‌కు రాగా వృద్ధురాలిని అప్పగించారు. కాగా యశోదమ్మ తప్పిపోయినట్లు ఈ నెల 16న కర్ణాటకలో కేసు నమోదైంది.